సాక్షి
తూర్పుగోదావరి

శనివారం ׀ 27 ׀ మే ׀ 2023



జోరందుకున్న బదిలీ ప్రక్రియ

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఊపందుకుంది. ఈ నెల 24 నుంచి బదిలీలకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించగా, శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలతో ఈ గడువు ముగిసింది. 10లో▸



8,089 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి నుంచి శుక్రవారం 8,089 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.70 అడుగులకు చేరింది.

గరిష్ఠం/కనిష్ఠం
38.5°/26.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	38.5	26.5
కాకినాడ	33.6	27.0
అమలాపురం	38.0	26.0

న్యూస్‌రీల్

బిచ్చగాళ్లతో హీరో విజయ్ ఆంటోనీ సందడి



బిచ్చగాళ్లకు భోజనం పెట్టిస్తున్న హీరో విజయ్ ఆంటోనీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని యాచకులతో బిచ్చగాడు–2 సినిమా హీరో విజయ్ ఆంటోని శుక్రవారం సందడి చేశారు. స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని గార్డెన్ ఫుడ్ రెస్టారెంట్‌లో బిచ్చగాళ్లకు భోజనాలు ఏర్పాటు చేసి స్వయంగా ఆయన వడ్డించారు. బిర్యానీ, ఫ్రైడ్‌రైస్, కబాబ్, కూల్‌డ్రింక్, ఐస్‌క్రీమ్‌లు పెట్టి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి చెప్పులు, కొబ్బరినూనె, వినసక్ర, దుస్తులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హీరో విజయ్ ఆంటోని మాట్లాడుతూ బిచ్చగాడు–2 సినిమాకు ఆంధ్రా, తెలంగాణ ప్రజలు ఎంతో ఆదరించారన్నారు. బిచ్చగాళ్లకు భోజనాలు పెట్టి వారి ఆకలి తీర్చడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ యేదుకొండ రఘురామ్, అభిమానులు పాల్గొన్నారు.

బాధితులకు రూ.19.25 లక్షలు అందజేత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ విక్టిం కాంపెన్సేషన్ పథకంలో ఏడుగురు బాధితులకు రూ.19.25 లక్షల నష్టపరిహారాన్ని శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి అందజేశారు. స్థానిక డీఎల్ఎస్ఏ కార్యాలయంలో బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ క్రిమినల్ కేసులను నల్సా చట్టం మేరకు పరిష్కరించి, పరిహారం చెల్లించామన్నారు. వేధింపులకు గురైన ఏడుగురు మహిళలు, చిన్నారులకు ఈ మొత్తాన్ని అందజేశామన్నారు.

ప్రశాంతంగా కంప్యూటర్ నైపుణ్య పరీక్ష



పరీక్షకు వెళ్లేవారి హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులకు నిర్వహించిన కంప్యూటర్ నైపుణ్యం పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా రెవెన్యూ అధికారి జీ.నరసింహులు తెలిపారు. కాతేరులోని జీఎస్ఆర్ ఆన్‌లైన్ అకాడమీలో ఈ పరీక్ష జరిగిందన్నారు. ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ జి.అశోక్ మాట్లాడుతూ మొత్తం 418 మందికి 388 మంది హాజరయ్యారన్నారు. మొదటి షిఫ్ట్‌లో వందమందికి గాను 98 మంది, రెండో షిఫ్ట్‌లో 106 మందికి గాను 92 మంది, మూడో షిఫ్ట్‌లో 106 మందికి గాను 101 మంది, నాలుగో షిఫ్ట్‌లో 106 మందికి గాను 99 మంది ఉద్యోగులు కంప్యూటర్ టెస్ట్‌కు హాజరయ్యారన్నారు. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఖాసిం వలీ, రూరల్ తహసీల్దార్ పి.చిన్నారావు, ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ వి.రత్నసాగర్, కళాశాల స్టాఫ్ ఈ పర్యవేక్షించారు.

భక్తజనంతో కిక్కిరిసిన రత్నగిరి



సత్యదేవుని దర్శనానికి క్యూలో భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధి జ్యేష్ఠ శుద్ధ సప్తమి పర్వదినం సందర్భంగా శుక్రవారం భక్తులతో పోటెత్తింది. ఒకవైపు వివాహాల సందడి, మరోవైపు స్వామివారిని దర్శించేందుకు విచ్చేసిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఇతర ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న నవదంపతులు శుక్రవారం ఉదయం సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. వీరంతా వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 40 వేల మంది భక్తులు సత్య దేవుని దర్శించి పూజలు చేశారు. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశా రు. స్వామివారి వ్రతాలు 2,500 జరుగగా అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



నల్లజర్ల మండలం దూబచర్లలో జీడిపప్పు పరిశ్రమలో జీడిగింజలను మిషన్లపై కటింగ్ చేస్తున్న కార్మికులు



నల్లజర్ల మండలం దూబచర్ల పరిశ్రమలో జీడిపప్పును గ్రేడింగ్ చేస్తున్న మహిళలు



నల్లజర్ల మండలం దూబచర్ల జీడిపప్పు పరిశ్రమలో జీడిపప్పు ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

జీడిదుడుకులు...



- సంక్షోభంలో పరిశ్రమలు
- నగానికి తగ్గిన గింజల ధర
- పప్పు ధర కిలో రూ.550
- ఉమ్మడి జిల్లాలో 50 పరిశ్రమలు
- రోజుకు ఐదు టన్నుల తయారు
- 80 వేల మందికి జీవనోపాధి

దేవరపల్లి: జీడిపప్పు వ్యాపారం ఒడిదుడుకుల్లో కొనసాగుతోంది. తయారైన పప్పు అడిగే నాథుడు లేక వ్యాపారులు లబోదిబోమంటున్నారు. పరిశ్రమలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఏడాది పొడవునా ఇదే పరిస్థితి నెలకొనడంతో వీరంతా గగ్గోలు పెడుతున్నారు. వచ్చేది ఆషాఢ మాసం.. మరింత సంక్షోభం ఏర్పడుతుందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పప్పు వ్యాపారం లేకపోతే బ్యాంకుల్లో అప్పుల వాయిదాలు కట్టలేమని వాపోతున్నారు. గింజల ధర తగ్గినప్పటికి పప్పునకు డిమాండ్ లేదని చెబుతున్నారు.

నిడదవోలు మండలంలో ఎక్కువ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో జీడిపప్పు పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. ప్రధాన వాణిజ్య పంటగా జీడిమామిడి తోటలను సాగు చేస్తున్నారు. ఇక్కడ పండిన గింజలతో పాటు విదేశీ గింజలను కొనుగోలు చేసి జీడిపప్పు తయారు చేస్తారు. తయారైన జీడిపప్పును గుండు, బద్ద, ముక్కగా తయారు చేసి ఇక్కడ నుంచి పట్టణ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. నిడదవోలు మండలం తాడిమళ్లలో ఎక్కువ పరిశ్రమలు ఉన్నాయి. తాడిమళ్ల, దేవరపల్లి, బందపురం, గొల్లగూడెం, నల్లజర్ల మండలం దూబచర్ల, ఘంటావారిగూడెం, గోపాలపురం ప్రాంతాల్లో చిన్న, పెద్ద పరిశ్రమలు దాదాపు 80 ఉన్నాయి. పరిశ్రమల్లో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సుమారు 80 వేల మంది ఉపాధి పొందుతున్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస తర్వాత జీడిపప్పు తయారీలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గుర్తింపు పొందింది.

నగానికి తగ్గిన జీడిగింజల ధర

జీడిగింజల ధర నగానికి తగ్గింది. జనవరిలో బస్తా(80 కిలోలు) గింజల ధర రూ.10,600 ఉండగా, ప్రస్తుతం రూ.5800 నుంచి 6500 ధర పలుకుతుంది. దీంతో ముందుగా గింజలు కొనుగోలు చేసి నిల్వ చేసిన వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. గింజల ధర తగ్గినప్పటికీ పప్పు దిగుబడులు తగ్గుతున్నాయని, నాణ్యత ఉండడంలేదని వ్యాపారులు అంటున్నారు. గింజలు బాగుంటే బస్తాకు 24 కిలోల పప్పు దిగుబడి వస్తుందని, ప్రస్తుతం గింజలు 22 కిలోలు పప్పు వస్తుందని వ్యాపారులు తెలిపారు. గింజలు నల్లబడి పప్పు నాణ్యత దెబ్బతింది.

తగ్గిన డిమాండ్

జీడిపప్పు కొనేనాథుడు కనబడటంలేదని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఆషాఢం రాకుండానే పప్పు డిమాండ్ తగ్గింది. మూహూర్తాల సమయంలో కూడా వ్యాపారాలు స్పీడుగా లేవని అంటున్నారు. వ్యాపారాలు లేనందున ఆషాఢమాసం పరిశ్రమలు మూసివేయనున్నామని వ్యాపారులు తెలిపారు. కిలో పప్పు ధర రూ.480 నుంచి 550 పలుకుతుంది. ఈ ధర గిట్టుబాటు కాదని వ్యాపారులు అంటున్నారు. బస్తాకు రూ.1500 నుంచి 2000 వేలు నష్టం వస్తుందని వ్యాపారులు తెలిపారు.

పట్టణ ప్రాంతాలకు ఎగుమతి

ఇక్కడ తయారైన జీడీపప్పును పట్టణ ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. రోజుకు 4 నుంచి 5 టన్నుల జీడిపప్పు తయారవుతుంది. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, కనిగిరి, బందరు, వరంగల్, ఒంగోలు ప్రాంతాలకు ఎగుమతి జరుగుతుంది.

వ్యాపారాలు బాగా లేవు



పప్పు వ్యాపారం జరగడంలేదు. జీడిపప్పు కొనుగోళ్లు తగ్గాయి. ప్రస్తుతం పప్పు నిల్వలు పేరుకుపోయాయి. ధర గిట్టుబాటు కావడంలేదు. కిలో పప్పు రూ.550 ఉంది. అయినా ఎవరూ అడగడం లేదు. ఏడాదిగా మార్కెట్ పరిస్థితి ఇలాగే ఉంది. బ్యాంకుల్లో తెచ్చిన అప్పులు కట్టలేకపోతున్నాం. జిల్లాలో 50 పరిశ్రమలు ఉన్నాయి. దాదాపు 80 వేల మంది ఉపాధి పొందుతున్నారు.

– కొండపల్లి రమేష్‌బాబు, కార్యదర్శి, శ్రీవేంకటేశ్వర క్యాజూ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్

పరిశ్రమలు నడపడం కష్టంగా ఉంది



జీడిపప్పు వ్యాపారాలు బాగా లేవు. అమ్ముదామంటే కొనేవారు కరవయ్యారు. పప్పు నిల్వలు పేరుకుపోతున్నాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉంటే నాణ్యత దెబ్బతింటుంది. కిలో జీడిపప్పు రూ.480 నుంచి 550 పలుకుతుంది. గింజల నాణ్యత వర్షాలకు దెబ్బతింది. జీడిపప్పు వ్యాపారం మెట్టప్రాంతంలో కుటీరపరిశ్రమగా ఉంది. వేలాది మంది మహిళలకు ఉపాధి కలుగుతుంది. పరిశ్రమలు మూసివేస్తే ఉపాధి కుంటుపడుతుంది.

– తొమ్మండ్రు రమేష్‌బాబు, జీడిపప్పు వ్యాపారి, దూబచర్ల,నల్లజర్ల మండలం

సీఎంకు అభినందనలు తెలిపిన హోంమంత్రి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు చెబుతున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు సుమారు రూ.50కోట్లు మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కృతజ్ఞతలు తెలిపారు. జగనన్న విద్యా దీవెన సభలో హామీ ఇవ్వడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. అమరావతి పరిధిలో వెంకటపాలెంలో శుక్రవారం ఆమె ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కొవ్వూరులో హెలిప్యాడ్ వద్ద కలిసి బాధలను వెలిబుచ్చుకున్న వారికి 24 గంటలు తిరగకుండానే తక్షణ సాయం కింద రూ.21లక్షలు అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇంత వరకు ఏ ముఖ్యమంత్రి ఇంత వేగంగా బాధితులకు సాయం అందించిన దాఖలాలు లేవన్నారు.

సుదీర్ఘ కాలంగా కొవ్వూరులో సమస్యగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి రూ.30కోట్లు నిధులు కేటాయించడం, మూడు చోట్ల అంబేద్కర్ భవనాల నిర్మాణానికి, కాపు కళ్యాణ మండపం ,ముస్లిం షాదీఖానాకు, ఎస్సీ కమ్యూనిటీ హాలు, కొవ్వాడ కాలువపై కల్వర్టు నిర్మాణం పనులకు నిధులు మంజూరు చేసినందుకు సంతోషం వెలిబుచ్చారు.

ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా చర్యలు

- ఎరువులు, విత్తనాలు, సాగునీటి విడుదలకు ప్రాధాన్యం
- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత
సేంద్రియ సాగు పెంచేలా చర్యలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో ఏఒక్క రైతు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ మాధవీలత అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ గత వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చర్చించిన పలు అంశాలపై సానుకూలంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఖరీఫ్‌లో సాగు నుంచి ధాన్యం కొనుగోలు చేసే వరకు రైతుల నుంచి వచ్చిన సూచనల మేరకు భవిష్యత్తు కార్యాచరణ అమలు చేస్తామన్నారు. జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, సాగునీరు విడుదల చేయడంతో పాటు పండించిన ధాన్యం కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్లో ఆగస్టు నాటికి నూరుశాతం కోతలు పూర్తి చేశారన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాలోని 147 మిల్లుల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టామన్నారు. వీటిలో 12 మిల్లులకు షోకాజ్‌లు ఇచ్చామని, మరో రెండు మిల్లులను మూడేళ్ల పాటు సీఎంఆర్ సేకరణలో పాల్గొనకుండా అనర్హత వేటు వేశామన్నారు. మిల్లెట్స్, సేంద్రియ వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచేలా అడుగులు వేయాలన్నారు. రబీలో జిల్లాలో 33 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో 3 వేల మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని, ఇందులో 22 మెట్రిక్ టన్నుల వివరాలు మిల్లులకు అనుసంధానం చేస్తూ నవీకరణ చేశామన్నారు. మిగిలిన 11 వేల మెట్రిక్ టన్నులను రెండు మూడు రోజుల్లో పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆఫ్‌లైన్ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం చెల్లింపులకు చర్యలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు భూసార ఆరోగ్య కార్డులను అందజేయాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో వ్యక్తిగతంగా స్ప్రేయర్లు, టార్పాలిన్లు, సూక్ష్మ పోషకాలు యూనిట్స్ రాయితీపై సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కంటే తేజ, జి.జనార్దనరావు, ఆదర్శ రైతులు ఎం.నరసింహారావు, డి.రామకృష్ణ, పి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం. నంద కిషోర్ పాల్గొన్నారు.

వైఫల్యాలపై మహానాడులో ఆత్మ పరిశీలన చేసుకోండి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో 14 సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా పనిచేశానంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబు, రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఏమిచేశారో మహానాడు వేదికపై ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా హితవు పలికారు. తన సుదీర్ఘ పదవీ కాలంలో జరిగిన వైఫల్యాలను కూడా నిజాయితీగా ఒప్పుకోవాలన్నారు. శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు పేరు చెపితే 'వెన్నుపోటు' గుర్తుకొస్తుందన్నారు. దానికి ఆయన ఒక బ్రాండ్ అంబాసిడార్‌గా నిలిచిపోయారన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించమని కోరిన అన్నదాతలను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపిన ఘటన కూడా గుర్తు కొస్తుందన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు చెపితే 108, ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ పథకాలు గుర్తుకొస్తాయన్నారు. ఆయన తనయుడు, సీఎం జగన్ కూడా తండ్రి బాటలోనే పయనిస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, ప్రజారంజకమైన పాలనను అందిస్తున్నారన్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం పై ఏవిధంగానైనా బురద చల్లాలనే దుర్బుద్ధితో చంద్రబాబు అండ్ కో ప్రయత్నించడం సిగ్గుచేటు అన్నారు. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు అధికార దాహం తీర్చుకోడానికి దేనికైనా సిద్ధపడతారన్నారు.

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్టీఆర్‌పై కపట ప్రేమను కురిపిస్తూ ఎన్టీఆర్ శతజయంతి మహానాడు ఉత్సవాలకు సిద్ధపడటం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, దుర్యోధనుడు, అల్లూరి సీతారామరాజుగా ఉన్న ఎన్టీఆర్ బొమ్మలతో 152 పేజీల శతజయంతి మహానాడు ముసాయిదా తీర్మానాలను పుస్తకంగా చూపిన చంద్రబాబు, వెన్నుపోటు సంఘటనను కూడా ముద్రించి ఉంటే ఆ పార్టీలోని యువనేతలకు 'వెన్నుపోటు' రాజకీయాల గురించి తెలుసుకునే అవకాశం వచ్చేదని వ్యంగ్యంగా అన్నారు. ఎన్ని కుప్పిగంతులేసినా రాబోయే ఎన్నికలలో చంద్రబాబును ప్రజలు విశ్వసించరన్నారు. మరోసారి భారీ మెజార్టీతో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని రాజా పేర్కొన్నారు.

జలం.. విషమయం

- కాలుష్య కాసారాల్లా డెల్టా కాలువలు
- యథేచ్ఛగా కలుస్తున్న మురుగునీరు
- నాలుగు నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి
- తీర మండలాల్లో ఉప్పునీటి ముప్పు
- నేటి ఐఏబీ సమావేశంలో ప్రస్తావించనున్న సభ్యులు

సాక్షి, అమలాపురం: ఒకప్పుడు గోదావరి డెల్టా పంట కాలువల నుంచి.. బిందెలు, బకెట్లతో నేరుగా తాగునీరు తీసుకుని వెళ్లేవారు. కాలువలు లేని వారు గ్రామాల్లోని మంచినీటి చెరువుల ద్వారా తాగునీరు సేకరించేవారు. కొన్ని దశాబ్దాలుగా చూపుతున్న నిర్లక్ష్యంతో ప్రస్తుతం కాలువలు కాలుష్య కాసారాలను తలపిస్తున్నాయి. గ్రామాలు, పట్టణాల నుంచి వస్తున్న మురుగునీరు, ఇళ్లల్లోని వాడకం నీరు, మరుగుదొడ్ల వ్యర్థాలను యథేచ్ఛగా కాలువల్లో కలిపేస్తున్నారు. కాలువల్లో పశువులను కడగడం, వాటి వ్యర్థాలను వదిలేయడం, దుస్తులు ఉతకడం, ఆక్వా చెరువుల నుంచి వాడకం నీటిని నేరుగా పంట కాలువల్లోకి వదిలేయడం వంటి దుశ్చర్యలతో డెల్టా కాలువలు తీవ్ర స్థాయిలో కలుషితమైపోతున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని ముమ్మిడివరం, అమలాపురం, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది. దీనికితోడు తీర మండలాల్లో సముద్రపు ఉప్పు నీరు నేరుగా పంట కాలువల్లోకి వస్తోంది. వీటన్నింటి ఫలితంగా డెల్టా కాలువల్లో కాలుష్యం పతాక స్థాయికి చేరింది.

పంట కాలువల నుంచి సేకరించిన నీటిని మున్సిపాలిటీలు, పంచాయతీలు శుభ్రపరచినా స్వచ్ఛమైన తాగునీరందని దుస్థితి. క్లోరినేషన్ చేసినా కాలువ నీటిలో వ్యర్థాలు, ప్రమాదకర రసాయనాలు పూర్తిగా తొలగడం లేదు. ఈ కారణంగానే మున్సిపాలిటీలు, పంచాయతీల్లో మంచినీటి ఆర్‌ఓ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్నాయి. జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం శనివారం కలెక్టరేట్‌లో జరగనుంది. ఈ సమావేశంలో జల కాలుష్యం అంశాన్ని ప్రస్తావించి, ఒక పరిష్కారం కనుగొనాలని సభ్యులు భావిస్తున్నారు.

35 లక్షల మందికి కాలువల నుంచే తాగునీరు

మన జిల్లాతో పాటు కాకినాడ, ఉభయ గోదావరి, ఏలూరు జిల్లాల్లో గోదావరి డెల్టా ప్రధాన పంట కాలువలు 430 కిలోమీటర్ల మేర ఉన్నాయని అంచనా. ఒక్కో ప్రధాన పంట కాలువ మీద 15 నుంచి 20 వరకూ డిస్ట్రిబ్యూటరీ చానల్స్ ఉన్నాయి. వీటి నిడివి 5 నుంచి 20 కిలోమీటర్ల వరకూ ఉంది. వీటికి అనుబంధంగా డిస్ట్రిబ్యూటరీ కాలువలు (డీసీలు), పంట బోదెలు ఉంటాయి. ఇలా అన్నీ కలిపి సుమారు 2 వేల కిలోమీటర్ల పొడవున డెల్టా కాలువల వ్యవస్థ ఉంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో కోటికి పైగా జనాభా ఉంటే సుమారు 35 లక్షల మంది ప్రజలకు డెల్టా కాలువల ద్వారానే తాగునీరు అందుతోంది.

నీటికి కాలుష్యం కాటు

ఇంతటి ప్రాధాన్యం ఉన్న డెల్టా కాలువల్లోని నీరు కాలుష్యం కాటుకు గురవుతోంది. ఫలితంగా స్వచ్ఛతను కోల్పోయి, నీరు ముదురు రంగులోకి మారిపోతోంది. దుర్గంధభరితమవుతోంది. ఉదజని సూచిక (పీహెచ్) గతంలో 7 ఉండగా, ఇప్పుడు 5.3 నుంచి 5.5 మధ్య ఉంటోంది. దీని వల్ల నీటిలో ఆమ్లత్వం పెరుగుతోంది. మరోపక్క ఆక్వా నీటి వలన కాలువల దిగువన క్షారత్వం పెరుగుతోంది. ఇక్కడ పీహెచ్ 7.8 నుంచి 8 వరకూ ఉంటోంది. కాలువల నీటిలో స్థాయికి మించి బ్యాక్టీరియా కూడా ఉంటోంది. దీనివల్ల ఎక్కువగా పచ్చకామెర్ల బారిన పడుతున్నారు. నైట్రేట్ల వల్ల చిన్నపిల్లల్లో బ్లూ బేబీ, ఇతర వయస్కులకు జీర్ణ, ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులు వస్తున్నాయి. నీటిలో క్రోమేట్ల వలన క్యాన్సర్, సల్ఫేట్ల వలన జీర్ణ సంబంధిత వ్యాధులు వస్తాయి.

గతంలో కాస్త కట్టడి

కాలువల్లోకి వ్యర్థాలు రాకుండా కొన్ని దశాబ్దాల కిందట పంట కాలువలు మూసివేసిన (క్లోజర్) సమయంలో ఇరిగేషన్ అధికారులు కొంత కట్టడి చేసేవారు. నోటీసులు ఇవ్వడం, అపరాధ రుసుములు వసూలు చేయడం, దగ్గరుండి కాలువల్లోని మురుగు నీటిని తొలగించడం వంటి చర్యలు చేపట్టేవారు. రెండు దశాబ్దాల నుంచి కాలువల శుభ్రతను ఆ శాఖ అధికారులు గాలికి వదిలేశారు. లష్కర్ల వ్యవస్థ ఉన్నదే తక్కువ. వీరిలో పని చేసేవారు మరింత తక్కువ కావడంతో వ్యర్థాలు యథేచ్ఛగా కలిసిపోతున్నాయి. సాధారణంగా క్లోజర్ సమయంలో మురుగునీరు కలిసే ప్రాంతాలను గుర్తించే అవకాశముంది. ఒక విధంగా చెప్పాలంటే వ్యర్థాలు కలవకుండా అడ్డుకోవడానికి ఇదే అదను. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.



తూర్పు డెల్టా పరిధిలో వేమగిరి వద్ద కోటిపల్లి బ్యాంకు కాలువ దుస్థితి



ఇది పంట కాలువే: రావులపాలెం వద్ద అమలాపురం – ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువ ఇలా..

కాలుష్య సమస్యను లేవనెత్తుతాం



గతంలో పంట కాలువల్లో కాలుష్యం ఈ స్థాయిలో లేదు. మున్సిపాలిటీలు, పంచాయతీలు కూడా కాలుష్యానికి కారణమవుతున్నాయి. డ్రెయిన్ల నుంచి మురుగు నీటిని నేరుగా కాలువల్లోకి వదిలేస్తున్నారు. జనావాసాల నుంచి వచ్చే మురుగు నీటిని నియంత్రించే అవకాశముంది. అయినా పట్టించుకోవడం లేదు. ఐఏబీ సమావేశంలో ఈ విషయాలపై చర్చిస్తాం.

– కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి, కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం, రామచంద్రపురం

నోటీసులు ఇస్తున్నాం



డ్రెయిన్ల నీరు కలవకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు ఇస్తున్నాం. పంచాయతీల నుంచి నేరుగా కాలువల్లోకి మురుగునీరు వదిలే ప్రాంతాలను గుర్తించి, తొలగించాల్సిందిగా డీపీఓలకు సైతం సమాచారం అందిస్తున్నాం. దీనిపై స్పందనలో ఫిర్యాదులు ఎక్కువగా వస్తుండగా వాటిని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం.

– డీవీ రామ్‌గోపాల్, జిల్లా జలవనరుల శాఖ అధికారి

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ: గూడ్సు రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి (50) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) ఇన్‌స్పెక్టర్ విజయ శంకర్ కథనం ప్రకారం.. ధవళేశ్వరం వంతెన వద్ద హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపాన ఈ సంఘటన జరిగింది. మృతుడి శరీరంపై నీలం, తెలుపు రంగు గడుల తువ్వాలు మాత్రమే ఉంది. ఇతర ఆధారాలేవీ లభ్యం కాలేదు. ఆచూకీ తెలిసిన వారు రాజమహేంద్రవరం జీఆర్‌పీ స్టేషన్‌ను నేరుగా లేదా 0883–2442821, 9491 444 022, 9440 62 7551 నంబర్లలో సంప్రదించాలని విజయ శంకర్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో.. ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన భార్యాభర్తలు, ఆటో డ్రైవర్

తాళ్లరేవు: చొల్లంగిపేట వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, కోరింగ పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ నుంచి యానాం వైపు వేగంగా వెళ్తున్న ఆటో చొల్లంగిపేట గాలి అమ్మోరు గుడి వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న మట్లపాలేనికి చెందిన కోలా అప్పన్న దంపతులు, ఆటోడ్రైవర్ పాలెపు ధర్మారావు తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై ప్రయాణిస్తున్న రెండేళ్ల చిన్నారి ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడింది. ప్రమాదంలో ఆటో, బైక్ రోడ్డు పక్కకు తుప్పల్లోకి దూసుకుపోయాయి. క్షతగాత్రులను 108లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బైక్‌ను ఢీకొన్న ఆటో

జోరందుకున్న బదిలీ ప్రక్రియ

- దరఖాస్తుకు అర్ధరాత్రితో ముగిసిన గడువు
- ఒకటి రెండు రోజులు పొడిగించాలని టీచర్ల విన్నపాలు
- డీఈఓ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు

రాయవరం: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఊపందుకుంది. ఈ నెల 24 నుంచి బదిలీలకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించగా, శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలతో ఈ గడువు ముగిసింది. అయితే బదిలీల వెబ్‌సైట్‌లో వస్తున్న సాంకేతిక ఇబ్బందులను దృష్ట్యా దరఖాస్తు గడువును ఒకటి రెండు రోజులు పొడిగించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. దీనిపై విద్యా శాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మరోవక్క బదిలీల ప్రక్రియలో చోటు చేసుకుంటున్న బాలారిష్టాలను అధిగమించే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.

పాస్‌వర్డ్ సహాయంతో..

బదిలీలకు జీరో సర్వీసు ఉండటంతో బదిలీ కోరుకునే వారికి, కోరుకోని ఉపాధ్యాయులకు కూడా వారి వ్యక్తిగత సెల్‌ఫోన్లకు విద్యా శాఖ పాస్‌వర్డ్ పంపించింది. బదిలీ కోరుకునే వారు మాత్రం ఈ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ ఆ పాస్‌వర్డ్‌ను ఇతరులకు తెలియకుండా భద్రపరచుకోవాలి. ఆ పాస్‌వర్డ్ సహాయంతో టీచర్ ట్రాన్స్‌ఫర్ లింక్‌కు ఉపాధ్యాయులు లాగిన్ అవుతున్నారు. వెంటనే వారి వివరాలు డిస్‌ప్లే అవుతున్నాయి. అందులో వారు నమోదు చేసిన వివరాల ఆధారంగా ఆటోమెటిక్‌గా పాయింట్ల కేటాయింపు జరుగుతోంది. ముఖ్యంగా సర్వీస్ సీనియారిటీ, స్టేషన్ సీనియారిటీ, ప్రిఫరెన్షియల్ కేటగిరీల ఆధారంగా పాయింట్లు డిస్‌ప్లే అవుతున్నాయి. పాయింట్లు డిస్‌ప్లే కాగానే బదిలీ సమాచారం ప్రివ్యూ చూసుకునే వీలుంది. ఆన్‌లైన్ బదిలీ దరఖాస్తులోని వివరాలతో సంతృప్తి చెందితే ఉపాధ్యాయుడు వాటిని సబ్‌మిట్ చేసుకోవచ్చు. అభ్యంతరాలుంటే మండల/డీవైఈఓ పరిధిలోని కమిటీలు పరిష్కరిస్తాయి. బదిలీలకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. దరఖాస్తు సమయంలో ఉత్పన్నమయ్యే సాంకేతిక ఇబ్బందులను ఏఎస్‌ఓ/ఏపీఓలు పరిష్కరిస్తున్నారు. జీఓలు, సర్వీసు పాయింట్లకు సంబంధించిన సమస్యలను ప్రతి జిల్లా విద్యా శాఖ కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్లు (సర్వీసెస్) పరిష్కరిస్తారు.

వీరికి బదిలీ తప్పనిసరి

- ఐదు విద్యా సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న గ్రేడ్–2 హెచ్‌ఎంలు (2018 నవంబర్ 18వ తేదీ ముందు చేరిన వారు).
- ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు (2015 నవంబర్ 18కు ముందు చేరిన వారు) తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలి.
- 2025 మే 31 నాటికి రిటైరయ్యే వారికి మాత్రం బదిలీల నుంచి మినహాయింపు ఉంది.
- ఈ నెలాఖరుకు పాఠశాలల్లో ఉన్న ఖాళీ పోస్టులను బదిలీ కోరుకునే ఉపాధ్యాయులకు డిస్‌ప్లే చేస్తారు.
- రీ అపోర్షన్‌మెంట్‌కు గురైన ఉపాధ్యాయుల జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వీరందరూ బదిలీలకు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలి.
- 2022 ఆగస్టు 31 నాటికి ఉండే రోల్ ఆధారంగా రీ అపోర్షన్‌మెంట్ చేశారు.
- తమ సమ్మతి ప్రకారం సబ్జెక్టు కన్వర్షన్ అయిన స్కూల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా కన్వర్ట్ అయిన సబ్జెక్టులో బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సబ్జెక్టు కన్వర్షన్ ఇచ్చిన ఉపాధ్యాయులు 74 మంది ఉన్నట్లు సమాచారం.

1,209 కొత్త పోస్టుల మంజూరు

జాతీయ విద్యా విధానం ప్రకారం ఉమ్మడి జిల్లాలో కొత్తగా పీఈటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరయ్యాయి. హైస్కూల్+ పాఠశాలల్లో కొత్తగా 321 పోస్టులు మంజూరు కాగా, వీటిని అర్హతలున్న స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేస్తున్నారు. రెండు దశల్లో భర్తీ ప్రక్రియ చేపట్టగా, మిగిలిన ఖాళీలను కూడా వెనువెంటనే భర్తీ చేసేందుకు విద్యా శాఖ చర్యలు తీసుకుంటోంది. అలాగే ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్–2 హెచ్‌ఎం (ప్రభుత్వం)–2, గ్రేడ్–2 హెచ్‌ఎంలు(జెడ్పీ)–37, జెడ్పీ యాజమాన్యంలో స్కూల్ అసిస్టెంట్(గణితం)–135, ఎస్‌ఏ(పీఎస్)–113, ఎస్‌ఏ(సోషల్)–119, ఎస్‌ఏ (ఇంగ్లిష్)–264, ఎస్‌ఏ(పీఈటీ)–218 పోస్టులను భర్తీ చేయనున్నారు. బదిలీ ప్రక్రియ పూర్తయిన వెంటనే పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ఈ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ జాబితాను ఇప్పటికే డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.



రాయవరం ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయుల బదిలీ దరఖాస్తులను పరిశీలిస్తున్న మండల కమిటీ

నేటి నుంచి పదోన్నతుల ప్రక్రియ

పదోన్నతులకు సంబంధించి సెకండరీ గ్రేడ్ టీచర్ల నుంచి శనివారం నుంచి విల్లింగ్, అన్‌విల్లింగ్ లెటర్లు తీసుకోనున్నారు. కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ ప్రక్రియ చేపడతారు.

మండల స్థాయిలో వెరిఫికేషన్

బదిలీ దరఖాస్తులను డీవైఈఓ/మండల స్థాయి కమిటీ పరిశీలిస్తోంది. ఐదేళ్లు/ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుని బదిలీకి అర్హత ఉన్న ఉపాధ్యాయులందరూ దరఖాస్తులు పంపించారా, లేదా అనే విషయాన్ని ప్రధానంగా పరిశీలిస్తున్నారు. అలాగే రీ అపోర్షన్‌మెంట్‌కు గురైన వారు, మిగులు ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేశారా, లేదా, ప్రత్యేక కేటగిరీ, స్పౌజ్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల సర్టిఫికెట్లు నిబంధనల ప్రకారం ఉన్నాయా, లేదా అనే విషయాన్ని డివిజన్/మండల కమిటీలు పరిశీలించాలి.

నిబంధనల ప్రకారం బదిలీ ప్రక్రియ



ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన గ్రేడ్–2 హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న వారితో పాటు విద్యార్థుల సంఖ్య తగ్గడం, పాఠశాలల మ్యాపింగ్ వలన ప్రభావం పడిన టీచర్లు, సబ్జెక్టు కన్వర్షన్ ఇచ్చిన వారు బదిలీకి కచ్చితంగా దరఖాస్తు చేసుకోవాలి. తప్పనిసరి బదిలీకి అవకాశం ఉండి, దరఖాస్తు చేయని ఉపాధ్యాయులపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం. అటువంటి వారిని బదిలీల అనంతరం ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడికి బదిలీ చేస్తాం.

– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, జిల్లా విద్యాశాఖాధికారి, కాకినాడ

నీళ్లకుండీలో పడి బాలుడి దుర్మరణం



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు



ధనుష్ (పాతచిత్రం)

దేవరపల్లి: ఇంటి వద్ద ఉన్న నీళ్లకుండీలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన దేవరపల్లి మండలం యర్నగూడెంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కందివలస నారాయణ, రేణుక దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కార్తిక్, రెండో కుమారుడు ధనుష్ (5). నిరుపేద కుటుంబం కావడంతో నారాయణ దంపతులు కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. నారాయణ దివ్యాంగుడు అయినప్పటికీ రెక్కలు ముక్కలు చేసుకుంటూ బిడ్డల్ని చదివిస్తున్నాడు. అంగన్‌వాడీ స్కూలుకు వెళ్లడానికని శుక్రవారం ఇంటి వద్ద ఉన్న నీళ్లకుండీ వద్దకు ధనుష్ వెళ్లాడు. కుండీలోని మగ్గు తీయడానికి కిందకు వంగాడు. ఆ క్రమంలో ప్రమాదవశాత్తూ ఆ కుండీలో పడి మృతి చెందాడు. పొలం పనికి వెళ్లిన తండ్రి నారాయణ ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. కాళ్లు, చేతులు కడుక్కునేందుకు కుండీ వద్దకు వెళ్లగా.. అందులో ధనుష్ మునిగి ఉన్నాడు. దీంతో బెంబేలెత్తిన నారాయణ, కుటుంబ సభ్యులు ఆ బాలుడిని దేవరపల్లి పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ధనుష్ మృతి చెందాడని వైద్యాధికారులు తెలిపారు. ఇంటి వద్ద అల్లారు ముద్దుగా ఉండే ముక్కుపచ్చలారని గారాల బిడ్డ ఇక లేడని తెలియడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

అదనపు ఫీజులు వసూలు చేస్తే కళాశాలలు సీజ్

- వాటి లైసెన్సులు రద్దు
- పాఠశాలల పునఃప్రారంభం నాడే జగనన్న విద్యా కానుక
- విద్యా శాఖ మంత్రి బొత్స హెచ్చరిక

దేవరపల్లి: విద్యార్థుల నుంచి అదనపు ఫీజులు వసూలు చేసే కళాశాలలను సీజ్ చేస్తామని, వాటి లైసెన్స్ రద్దు చేస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హెచ్చరించారు. దేవరపల్లి మండలం పల్లంట్లలో వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) నివాసంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇంజినీరింగ్, డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జగనన్న విద్యా దీవెన పథకం కింద మూడో త్రైమాసిక నిధులు జమ చేశామని చెప్పారు. వీరికి ఆగస్టులో విడుదల చేయాల్సిన నాలుగో విడత జగనన్న విద్యా దీవెన నిధులను కూడా ముందుగానే జమ చేశామని, ఈ మేరకు జీఓ కూడా విడుదల చేశామని తెలిపారు. ఈ ఏడాది జమ చేసిన నిధులను వెంటనే ఆయా కళాశాలలకు చెల్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి తెరిచే రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందజేస్తామని మంత్రి చెప్పారు. మన బడి నాడు – నేడు కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందని, మొదటి విడత పనులు దాదాపు పూర్తి కాగా, రెండో దశ పనులు జరుగుతున్నాయని, దీనికి నిధుల కొరత లేదని తెలిపారు. కొన్ని పాఠశాలల వద్ద అవసరానికి మించి తరగతి గదులు మంజూరయ్యాయని, వాటిని గుర్తించి పునాదుల దశలోనే నిలిపివేశామని చెప్పారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోతే తన దృష్టికి తీసుకురావాలని బొత్స కోరారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభించి నాలుగేళ్లవుతోందని, ఇంతవరకూ తరగతి గదులు, ఫర్నిచర్ సమకూర్చలేదని కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రేకుల షెడ్డులో తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆరు తరగతి గదులు, ఫర్నిచర్‌కు నిధులు మంజూరు చేయాలని రాజేంద్రబాబు కోరారు. ఈ మేరకు కళాశాలకు ఆరు తరగతి గదులు మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల తీరుపై పార్టీ నాయకులను ఆయన అరా తీశారు. కొనుగోళ్లు పూర్తయ్యాయని మంత్రికి నాయకులు, రైతులు తెలిపారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్రు స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షులు కె.సతీష్, మండల మహిళా కన్వీనర్ కడలి హైమావతి, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఎ.సూర్యచంద్రరావు, మైనార్టీ చైర్మన్ షేక్ ముస్తఫా పాల్గొన్నారు.



మంత్రి బొత్సకు జూనియర్ కళాశాల సమస్యలు వివరిస్తున్న చైర్మన్ రాజేంద్రబాబు

విహార యాత్రలో విషాదం

- అంతర్వేది బీచ్‌లో ఇద్దరి గల్లంతు
- యువతి మృతదేహం లభ్యం
- బాలుడి ఆచూకీ కోసం గాలింపు



గల్లంతైన బాలుడు రాజీవ్‌కుమార్ (పాతచిత్రం)



మృతురాలు జ్యోతి (పాతచిత్రం)



విశ్వేశ్వరాయపురంలో విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



సంఘటన స్థలంలో జ్యోతి మృతదేహం

మలికిపురం/సఖినేటిపల్లి: విహార యాత్రలో విషాదం చోటు చేసుకుంది. అంతర్వేది బీచ్‌లో ఇద్దరు గల్లంతయ్యారు. వీరిలో యువతి మృతదేహం లభ్యం కాగా, బాలుడి ఆచూకీ తెలియ రాలేదు. ఇందుకు సంబంధించిన వివరాలివీ.. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామానికి చెందిన సాలా ఏసురాజు నూతన గృహం నిర్మించుకున్నాడు. గృహప్రవేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన 15 మంది బంధువులు శుక్రవారం అంతర్వేది సాగర సంగమం వద్దకు విహార యాత్రకు వెళ్లారు. ఎగసి పడుతున్న సాగర కెరటాలను చూసిన ఉత్సాహంలో.. ఏసురాజు కుమారుడు రాజీవ్‌కుమార్ (5) పరుగు పరుగున అక్కడకు వెళ్లాడు. వేగంగా నీటిలో దిగడంతో ఒక్కసారిగా మునిగిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన ఏసురాజు సోదరి, పశ్చిమ గోదావరి జిల్లా విస్సాకోడేరుకు చెందిన బెల్లపుకొండ జ్యోతి (20) ఒక్క ఉదుటన పరుగెత్తుకుని వెళ్లి, ఆ బాలుడిని రక్షించబోయింది. ఈ క్రమంలో అలల ధృతికి ఆమె కూడా సముద్రంలోకి కొట్టుకుపోయింది. కాసేపటికి జ్యోతి మృతదేహం లభ్యమైంది. బాలుని ఆచూకీ కోసం పోలీసులు, బంధువులు గాలిస్తున్నారు. బంధుమిత్రులందరితో కలిసి సందడిగా గృహప్రవేశం చేసుకున్నామన్న ఆనందం ఆ కుటుంబానికి ఒక్క రోజు కూడా నిలవలేదు. చిన్న కొడుకు గల్లంతవ్వడం, సోదరి జ్యోతి మృతి చెందడంతో ఏసురాజు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సంఘటన స్థలాన్ని సఖినేటిపల్లి ఎస్సై ఎస్.రాము సందర్శించారు. బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. జ్యోతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలో పిండ ప్రదానాల రేవు వద్ద గోదావరి నదిలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి (35) మృతదేహం లభ్యమైంది. పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ కథనం ప్రకారం.. ఆ వ్యక్తి మూడు రోజుల కిందటే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. పూర్తిగా పాడైపోయిన స్థితిలో ఈ మృతదేహం ఎగువ నుంచి కొట్టుకు వచ్చింది. వీఆర్‌ఓ సైదా రాణి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలూ లభ్యం కాలేదు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. వివరాల కోసం పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

యువకుడిపై హత్యాయత్నం

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. ఎస్సై ఎస్.శివప్రసాద్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పెల్లకు చెందిన వలమర్తి వీర అంజికుమార్ ఇంట్లో ఉండగా.. గురువారం రాత్రి 10 గంటల సమయంలో స్నేహితుడు చిన్ని ఫోన్ చేశాడు. తాను బడుగువానిలంక గోదావరి గట్టుపై మద్యం తాగుతుండగా.. మంగిన సాయి, దొండపాటి తేజ, వంగా సాయి, మెర్ల కిరణ్ వచ్చి అంజికుమార్‌ను తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతున్నారని చెప్పాడు. దీంతో కోపోద్రిక్తుడైన అంజికుమార్ స్నేహితులు కొత్తాడ రాజేష్, వెలిశెట్టి రాజేష్, భోగిశెట్టి నాగేంద్రలను తన బైక్‌పై ఎక్కించుకుని బయలుదేరాడు. అయితే దారిలో దుర్భాషలాడారని చెప్పిన నలుగురూ చెముడులంక ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ వద్ద ఉన్నారని గమనించాడు. వారి వద్దకు వెళ్లి తనను ఎందుకు తిడుతున్నారని అంజికుమార్ ప్రశ్నించాడు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో దుర్భాషలాడిన ఆ నలుగురూ అంజికుమార్‌పై మూకుమ్మడిగా దాడి చేశారు. బ్లేడుతో విచక్షణా రహితంగా అతడి శరీరమంతా చీల్చి తీవ్రంగా గాయపరిచారు. అంజికుమార్ మృతి చెంది ఉంటాడని భావించిన ఆ నలుగురూ అక్కడి నుంచి పరారయ్యారు. అంతలో స్పందించిన స్థానికులు అంజికుమార్‌ను తొలుత ఆలమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంజికుమార్ పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. ఎస్సై శివప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఇరువర్గాల మధ్య పాత కక్షలు కూడా ఉండి ఉండవచ్చని, ఈ నేపథ్యంలోనే ఈ దాడి జరిగిందని పోలీసులు భావిస్తున్నారు.

సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాస్ మృతి

- పిఠాపురంలో అంత్యక్రియలు
- పలువురి సంతాపం



కోట శ్రీనివాస్, ప్రధానార్చకుడు

అన్నవరం: శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఆలయ ప్రధానార్చకుడు, ధర్మకర్తల మండలి కో–ఆప్షన్ సభ్యుడు కోట ఎల్‌పీఎస్ఎన్ శర్మ (శ్రీనివాస్) (55) శుక్రవారం మృతి చెందారు. సోమవారం రాత్రి ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కాకినాడలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెదడులో రక్తనాళాలు గడ్డ కట్టి, రక్త ప్రసరణ ఆగిపోయిందని, చికిత్సకు ఆయన శరీరం సహకరించడం లేదని వైద్యులు తెలపడంతో బుధవారం మధ్యాహ్నం అన్నవరం శివార్లలోని ఆయన బంధువుల ఇంటికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో శ్రీనివాస్ శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఆయన మృతదేహానికి పిఠాపురంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం అయింది.

పలువురి నివాళులు

కోట శ్రీనివాస్ మృతికి పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే అర్చకుడిగా నియమితులైన ఆయన అంచెలంచెలుగా ఎదిగి 2021లో ప్రధానార్చకుడిగా నియమితులయ్యారు. 2022, 2023 సంవత్సరాల్లో స్వామివారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాల్లో కీలక భూమిక పోషించారు. దేవస్థానంలో అదనంగా పరిచారకులుగా పని చేస్తున్న 15 మందిని దేవస్థానంలో సంభావన పరిచారకులుగా నియమించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 2018, 2019లో ఢిల్లీ టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన సత్యదేవుని కల్యాణం, సామూహిక వ్రతాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ సందర్భంగా శ్రీనివాస్‌ను అప్పటి ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు. ఇటీవల విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రాజశ్యామల యాగంలో భాగంగా ఈ నెల 14వ తేదీన నిర్వహించిన సత్యదేవుని కల్యాణంలో కూడా శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన మృతికి దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ ఆజాద్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు, దేవస్థానం అర్చకులు, వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు రవిశర్మ తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.



సత్యదేవుని పుష్పయాగంలో పాల్గొన్న ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ (కుడివైపు వ్యక్తి)